భారత్‌లో... బ్యాంకింగ్ రంగం



భారత్‌లో స్వాతంత్ర్యానంతరం బ్యాంకింగ్ వ్యవస్థ బాగా పుంజుకుంది. ప్రణాళికా లక్ష్యాల సాధనకు ఊతమిచ్చింది. నూతన ఆర్థిక విధానాలు, నరసింహం కమిటీ సిఫార్సుల నేపథ్యంలో... దేశంలో వాణిజ్య బ్యాంకుల విస్తరణకు మంచి ప్రోత్సాహం లభించింది.

20వ శతాబ్దం మొదటి అర్ధభాగంలో భారతదేశంలో బ్యాంకింగ్ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. స్వాతంత్ర్యానంతరం మాత్రం ఊపందుకొని, మంచి పురోగతి సాధించింది. ప్రణాళికాబద్ధ ఆర్థిక వృద్ధి, ద్రవ్య సరఫరా పెరుగుదల, ప్రజల్లో బ్యాంకింగ్ వినియోగం పెరగడం, ఆర్‌బీఐ నియంత్రణ, మార్గదర్శకత్వం, బ్యాంకుల జాతీయకరణ ఈ రంగం పురోభివృద్ధికి కారణాలు. భారత ప్రభుత్వం జులై 19, 1969న బ్యాంకుల జాతీయకరణ చేసింది. 1969, జూన్‌లో కేవలం 8260 శాఖలున్న భారత బ్యాంకింగ్ రంగం... 2005 జూన్ నాటికి 68,500 శాఖలకు విస్తరించింది. గ్రామీణ ప్రాంతాల్లో 1969లో 1860 బ్యాంకు శాఖలుంటే.. 2005 జూన్ నాటికి 32,070లకు పెరిగాయి. 1969లో మొత్తం వాణిజ్య బ్యాంకుల శాఖలలో.. గ్రామీణ ప్రాంతాలలోని శాఖలు 22 శాతం కాగా... 2005లో 47 శాతానికి పెరిగాయి. 1969లో ప్రతి 63,800 మందికి ఒక బ్యాంకు శాఖ ఉండగా... 2005 జూన్ నాటికి ప్రతి 15,000 మందికి ఒక బ్యాంకు శాఖ ఉంది. 1950-51లో అన్ని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల డిపాజిట్లు రూ. 820 కోట్ల. అవి 2006-07 నాటికి రూ.26,08,309 కోట్లకు పెరిగాయి. ఇదే కాలంలో ఈ బ్యాంకులిచ్చిన పరపతి రూ.580 కోట్ల నుంచి రూ.19,28,913 కోట్లకు పెరిగింది.

నరసింహం కమిటీ:

నూతన ఆర్థిక విధానాలకు అనుగుణంగా బ్యాంకింగ్ రంగాన్ని సన్నద్ధం చేసేందుకు .. 1991 జులైలో భారత రిజర్వు బ్యాంకు మాజీ అధ్యక్షుడు ఎం.నరసింహం అధ్యక్షతన ఒక అధ్యయన సంఘాన్ని ఏర్పాటు చేశారు. 1998లో నరసింహం అధ్యక్షతన మరో కమిటీ వేశారు. సంస్కరణల పురోగతని పరిశీలించి, దేశ విత్త వ్యవస్థను పటిష్టపరిచేందుకు సూచనలు చేయాల్సిందిగా ఈ కమిటీని ప్రభుత్వం కోరింది.

నరసింహం కమిటీ-1 (1991) సిఫార్సులు:

1) వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహాని కిచ్చే ప్రత్యక్ష పరపతిని దశలవారీగా తొలగించాలి. ప్రత్యక్ష పరపతి విధానం తాత్కాలికంగానే ఉండాలి. ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగకూడదు.
2) నగదు నిల్వల నిష్పత్తి (CRR), Statutory Liquidity Ratio తగ్గించాలి.
3) వాణిజ్య బ్యాంకులు తమ వడ్డీరేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛని వ్వాలి.
4) ఇకపై బ్యాంకుల జాతీయకరణ చేపట్టరాదు.
5) ప్రైవేటు రంగంలో వాణిజ్య బ్యాంకులను ప్రోత్సహించాలి.
6) వాణిజ్య బ్యాంకులు ఇచ్చే రుణంలో కొంత తమ సొంత మూల ధనం అయి ఉండాలి.
7) Asset Reconstruction Fund ఏర్పాటు చేయాలి.
8) బ్యాంకింగ్ ఖాతాదార్ల ఫిర్యాదులను పరిష్కరించడానికి ఒక అంబుడ్స్‌మన్ (OMBUDSMAN) పథకాన్ని ప్రవేశపెట్టాలి.
9) రికవరీ కాని రుణాలు వసూలు చేసేందుకు ట్రైబునల్స్‌ను ఏర్పాటు చేయాలి.

10)ప్రాధాన్యతా రంగానికిచ్చే రుణాలను 40 శాతం నుంచి 10 శాతానికి తగ్గించాలి.

నరసింహం కమిటీ – 2 సిఫార్సులు (1998):

1) బ్యాంకింగ్ వ్యవస్థకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి.
2) మూడంచెల బ్యాంకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
3) వాణిజ్య బ్యాంకులు నిర్వహించాల్సిన Capital Adequacy Ratio (CAR) పెంచాలి.
4) వాణిజ్య బ్యాంకులలో ప్రభుత్వ లేదా ఆర్‌బీఐ వాటాను 51 శాతం నుంచి 33 శాతానికి తగ్గించాలి.
5) వాణిజ్య బ్యాంకులలో ఆర్‌బీఐ డైరక్టర్ల సంఖ్యను తగ్గించాలి.

ఎం.నరసింహం కమిటీ సిఫార్సులలో కొన్నింటిని ప్రభుత్వం అమలుచేసింది. ముఖ్యంగా ప్రాధాన్యతా రంగానికిచ్చే రుణాలను 40 శాతం నుంచి 10 శాతానికి తగ్గించాలనే నరసింహం కమిటీ సిఫార్సు వివాదాస్పదమైంది. దేశంలోని ఎక్కువమంది ప్రజల జీవనాధారమైన వ్యవసాయరంగం, చేతివృత్తులకు ఇచ్చే రుణాలను తగ్గించాలనడం విమర్శలకు గురైంది. వాణిజ్య బ్యాంకులలో ప్రభుత్వ లేదా ఆర్‌బీఐ వాటాను తగ్గించాలన్న సిఫార్సుకు కూడా ప్రభుత్వం అంగీకరించ లేదు. అయితే, కమిటీ సూచించినట్లుగానే 1991 తర్వాత బ్యాంకుల జాతీయకరణ జరగలేదు. ప్రైవేటు రంగంలో వాణిజ్య బ్యాంకులకు ప్రోత్సాహం పెరిగింది. CRR, SLR తగ్గించారు. వాణిజ్య బ్యాం కులు మార్కెట్‌కు అనుగుణంగా తమ వడ్డీరేట్లను నిర్ణయించుకొనే స్వేచ్ఛ లభించింది. CARను 9%గా నిర్ణయించారు. ఖాతాదార్ల ఫిర్యాదులు పరిష్కరించేందుకు 1995లో ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. నిరర్ధక ఆస్తులు (Non performing assets) పరిష్కరించడానికి రుణ రికవరీ ట్రైబ్యునళ్లు, Appelate tribunal ఏర్పాటు చేశారు.

ద్రవ్య సరఫరా:

దేశంలో ద్రవ్య సరఫరాను కొలవడానికి ఆర్‌బీఐ సమష్టి ద్రవ్య వనరుల శీర్షికను ప్రకటించింది. ద్రవ్య సరఫరా నాలుగు రకాల నిర్వచనాలిచ్చి... వాటిని M1, M2, M3, M4 గా పేర్కొంది. వీటిలో M1, M3 మాత్రమే వాడుకలో ఉండగా.. M4 ను రద్దు చేసింది. M2 వాడుకలో లేదు. 1991లో M1రూ. 92,892 కోట్లు నుంచి 2006–07లో రూ.9,65,129 కోట్లకు పెరిగింది. M3 ఇదేకాలంలో రూ.2,65,828 కోట్ల నుంచి రూ.33,10,212 కోట్లకు పెరిగింది. M1 ను సంకుచిత ద్రవ్యమని (Narrow Money), M3ను (Broad Money) విశాల ద్రవ్యమని అంటారు. 2008 ఏప్రిల్ నుంచి M2, M3కు సంబంధించి ద్రవ్య సరఫరాను కొలిచే నిర్వచనంలో ఆర్‌బీఐ మార్పును ప్రకటించింది. సవరించిన M2 = M1 + Time liability portion of saving deposits with banks + బ్యాంకులు ఇష్యూ చేసే సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్లు + Term deposits maturing within a year. సవరించిన M3 = M1 + Term deposits over one year maturity + call or term borrowings of banks.

ద్రవ్య విధానం :

ద్రవ్య సరఫరా నియంత్రణకు ఆర్‌బీఐ అవలంభించే విధానాన్ని ద్రవ్య విధానం అంటారు. ఆర్‌బీఐ తన ద్రవ్య విధానాన్ని ఏప్రిల్, అక్టోబర్ లలో ప్రకటిస్తుంది. ఆర్థికాభివృద్ధిని పెంపొందించడం ద్రవ్య విధానం లక్ష్యం. లభ్యమయ్యే అన్ని వనరులను సమర్థంగా వినియోగించుకొని జాతీయాదాయ స్థాయిని పెంపొందించుకోవడానికి ద్రవ్య విధానం ఉపయోగపడుతుంది. రిజర్వు బ్యాంకు ముఖ్యవిధి పరపతి నియం త్రణ. ఇందులో భాగంగా పరిమాణాత్మక, గుణాత్మక లేదా విచక్షణా త్మక పరపతి నియంత్రణపద్ధతులను పాటించి, ఆర్‌బీఐ పరపతిని క్రమబద్ధం చేయగలుగుతుంది. పూర్ణోద్యోగిత సాధించడం, ధరల స్థిరత్వం, ఆర్థికస్థిరత్వం, విదేశీ చెల్లింపుల శేషం అనుకూలంగా ఉండేట్లు చూడటం ఆర్‌బీఐ ద్రవ్య విధాన లక్ష్యాలు. 1982లో ద్రవ్య విధాన అధ్యయనానికి చక్రవర్తి కమిటీని ఆర్‌బీఐ నియమించింది.

పరిమాణాత్మక పరపతి నియంత్రణ :

ఆర్‌బీఐ పరపతి పరిమాణాన్ని నియంత్రించే చర్యలు చేపట్టడమే పరిమాణాత్మక పరపతి నియంత్రణ. ఈ నియంత్రణ చర్యలు మూడు విధాలుగా ఉంటాయి.

1) బ్యాంక్ రేటు (రిజర్వ్ బ్యాంక్ వాణిజ్య బ్యాంకులకిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటు) 2) బహిరంగ మార్కెట్ చర్యలు (బహిరంగ మార్కెట్‌లో సెక్యూరిటీల అమ్మకం, కొనుగోలు) 3) నగదు నిల్వల నిష్పత్తి (ప్రతి వాణిజ్య బ్యాంకు తన డిపాజిట్లలో కొంత భాగాన్ని ఆర్‌బీఐ వద్ద ఉంచాలి. దీనినే CRR అంటారు). ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ పరిస్థితులు తలెత్తినప్పుడు ద్రవ్య సరఫరాను తగ్గించే చర్యల్లో భాగంగా ఆర్‌బీఐ బ్యాంక్ రేటును పెంచుతుంది. బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వ సెక్యూరిటీలను అమ్ముతుంది. నగదు–నిల్వల నిష్పత్తి పెంచుతుంది. ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడినపుడు ద్రవ్య సప్లయ్ పెంచే చర్యలో భాగంగా బ్యాంక్ రేటు తగ్గిస్తుంది. మార్కెట్‌లో ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేస్తుంది, CRR తగ్గిస్తుంది.

గుణాత్మక పరపతి నియంత్రణ :

ఆర్థికాభివృద్ధి సాధనలో దేశ శ్రేయస్సు కోసం ముఖ్యమైన ఆర్థిక కార్యకలాపాలకు పరపతి కల్పించి, హానికరమైన వాటికి పరపతి లేకుండా చేయడానికి అవలంభించే విధానాలు, సాధనాలే గుణాత్మక పరపతి సాధనాలు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రణాళికబద్ధ ఆర్థిక ప్రగతిలో భాగంగా గుణాత్మక పరపతి నియంత్రణ ప్రాధాన్యత సంతరించుకుంది.

గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు :

1)మార్జిన్‌లను నిర్ణయించడం

2) వినియోగదారుని పరపతి నియంత్రణ

3) పరపతి రేషనింగ్

4) ప్రత్యక్ష చర్య

5) ప్రచారం

6) నైతిక ఉద్బోధ

ముగింపు :

ప్రణాళికబద్ధ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకుల కార్యకలాపాలు.. ప్రణాళికా లక్ష్యాలు సాధించడానికి అనుగుణంగా ఉండాలి. ప్రణాళికా లక్ష్యాలు సాధించేందుకు వీలుగా వాణిజ్య బ్యాంకులు నిధులు కేటాయించాలి. కీలకమైన రంగాల అభివృద్ధికి ద్రవ్య వనరుల కొరత లేకుండా తోడ్పడాలి. రుణాల ఆవశ్యకతను సరిగా అంచనా వేసి, సమయానికి అందించి, సకాలంలో వసూలు చేసే పర్యవేక్షక సిబ్బందిని తయారు చేయాలి. ప్రైవేట్ బ్యాంకులు స్వల్ప ప్రయోజనాలు, సత్వర లాభాలకు పాల్పడకుండా నియంత్రించే పర్యవేక్షక యంత్రాంగాన్ని ఆర్‌బీఐ పటిష్టం చేయాలి.

రిజర్వ్‌బ్యాంకు - ద్రవ్య విధానం

స్థూల ఆర్థిక విధానాల్లో ప్రధాన అంశం ద్రవ్యవిధానం. విత్తరంగంపై ద్రవ్యవిధానం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో ఆర్థిక వ్యవస్థలో సమర్థత, పోటీతత్వం పెరిగాయి. ఈ విధానం వల్ల ప్రభావితమయ్యే ముఖ్య అంశం ద్రవ్యసప్లయ్. ధరల్లోని హెచ్చుతగ్గులు.. ఆర్థిక కార్య కలాపాల్లో ఒడిదుడుకులకు కారణమై ఆర్థికాభివృద్ధిపై తీవ్ర ప్రభా వాన్ని చూపుతాయి. సాధారణ ఆర్థిక లక్ష్యాల సాధనలో భాగంగా 'ద్రవ్యసప్లయ్ నియంత్రణ'కు కేంద్రబ్యాంకుకు ద్రవ్య విధానం ఒక నియంత్రణ విధానంగా ఉపకరిస్తుంది. అయితే భారత్ వంటి అభి వృద్ధి చెందుతున్న దేశాల్లో ద్రవ్యసప్లయ్ నియంత్రణకే ద్రవ్యవిధానం పరిమితం కాకూడదు. ఆర్థికాభివృద్ధిలో భాగంగా ద్రవ్యవిధానం ధనా త్మక పాత్ర నిర్వహిస్తే అది పరిమిత ఉద్దేశాలనే నెరవేర్చుతుంది. ప్రణాళికా యుగంలో నిర్దేశిత ఆర్థిక, సాంఘిక లక్ష్యాల సాధనకు ద్రవ్య విధానం తోడ్పడే విధంగా కేంద్రబ్యాంకు చర్యలు చేపట్టాలి.

ద్రవ్యవిధానం-లక్ష్యాలు

''పరపతిని క్రమబద్ధీకరిస్తూ ద్రవ్యసప్లయ్‌ను అదుపులో ఉంచి... సాధారణ ధరల స్థాయిలో సుస్థిరతను చేకూర్చడం ద్వారా ఆర్థికా భివృద్ధి ప్రక్రియను వేగవంతం చేసేందుకు కేంద్రబ్యాంకు(ఆర్‌బీఐ) అవలంబించే విధానమే ద్రవ్యవిధానం.'' ధరల స్థిరత్వం, వినిమయ రేటు స్థిరత్వం, పూర్ణోద్యోగిత సాధించడం, అధిక వృద్ధిరేటు సాధిం చడం వంటివి ఈ విధాన లక్ష్యాలు. వీటిని సాధించడానికి ద్రవ్య నిర్వహణ అత్యంత అవశ్యకం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో లభ్య మయ్యే వనరులను అభిలషణీయంగా వినియోగించుకుంటే జాతీయా దాయ స్థాయిని పెంచుకోవడానికి తోడ్పడుతుంది. ఈ దేశాల్లో పొదు పు, పెట్టుబడులను ప్రోత్సహించేలా ద్రవ్యవిధానం ఉండాలి. వాణిజ్య బ్యాంకులు పరపతిని పెంచినపుడు చలామణిలో ఉన్న ద్రవ్యం ఎక్కువవుతుంది. తద్వారా ఉత్పత్తి, ఉద్యోగిత, ఆదాయ స్థాయి పెరిగి ద్రవ్యోల్బణ స్థితి ఏర్పడుతుంది. పరపతి తగ్గితే ఉత్పత్తి, ఉద్యోగిత, ఆదాయ స్థాయిలకు సంబంధించి ప్రతికూల పరిస్థితులు ఏర్పడి ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఎదురవుతాయి. ఆర్థిక వ్యవస్థలో సంభవించే అలజడులను రూపుమాపే శక్తిమంతమైన సాధనే ద్రవ్యవిధానం.

వినిమయ రేటులో అస్థిరత్వం అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభా వాన్ని చూపుతుంది. ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతుంది. వినిమయ రేటులో ఏర్పడే ఒడిదుడుకులు ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులను పరిమితం చేస్తాయి. కాబట్టి ఒక దేశం వినిమయ రేటులో స్థిరత్వం సాధించడం అవసరం. ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగిత, ఉత్పత్తి స్థాయి ఆయా దేశాల్లోని సాంకేతిక పరిజ్ఞానం, మానవ వనరులపై ఆధారపడి ఉంటుంది. పూర్ణోద్యోగిత వనరుల అభిలషణీయ వినియోగాన్ని తెలు పుతుంది. ఉత్పత్తి, ఉద్యోగితలను ద్రవ్య విధానం స్వల్పకాలంలోనే ప్రభావితం చేస్తుంది. ఆర్థిక వ్యవస్థలో స్థిరీకరణ సాధించడంతో పాటు... ఉత్పత్తి, ఉద్యోగితల్లో ఎదురయ్యే ఒడిదుడుకులను తగ్గిస్తూ అధిక వృద్ధి సాధించడానికి ద్రవ్యవిధానం తోడ్పడాలి. ఆర్థికవృద్ధి ప్రోత్సహించడానికి ద్రవ్యవిధానం రెండు విధాలుగా దోహదపడు తుంది. ఓ వైపు సమష్టి ద్రవ్యడిమాండ్, సమష్టి వస్తు సప్లయ్‌ల మధ్య సమతుల్యత సాధించడం అంటే ధరల స్థిరత్వం సాధించడం.. మరో వైపు పొదుపు, పెట్టుబడుల పెరుగుదలను ప్రోత్సహించడంతో మూల ధన సంచయనం పెరిగి ఆర్థికవృద్ధి త్వరితగతిన సాధ్యమవుతుంది.

ఆర్థికవేత్తల అభిప్రాయాలు

ధరల స్థిరత్వం, ఆర్థికవృద్ధి, సమానత, సామాజిక న్యాయం సాధిం చడం, కొత్త ద్రవ్య, విత్త సంస్థలను ప్రోత్సహించడం ద్రవ్యవిధాన లక్ష్యాలుగా ఉండాలని ఎస్.చక్రవర్తి కమిటీ అభిప్రాయపడింది. ఎస్.నరసింహం అభిప్రాయంలో ''ఆర్‌బీఐ బాధ్యత పరపతి నియం త్రణొకటే కాదు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యసప్ల య్‌ను విస్తరిస్తూ బ్యాంకు పరపతి పెంచడం, పరపతి అవసరాలు తీర్చగలిగామా? లేదా? అని కేంద్రబ్యాంకు పరిశీలించాలి. అనుత్పా దక, అంచనా వ్యాపారాన్నుద్దేశించిన పరపతి తగ్గించే విధంగా ఆర్‌బీఐ విధానం ఉండాలి.'' ఇటీవల కాలంలో కేంద్రబ్యాంకు పరపతి విధానం 'నియంత్రణతో కూడుకున్న విస్తరణ'గా ఉంది. ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్ వై.వి.రెడ్డి అభిప్రాయంలో 'ధరల స్థిరత్వం ద్రవ్య విధాన లక్ష్యం'గా ఉండకూడదు. ద్రవ్యోల్బణాన్ని ఒక పరిమితిలో ఉంచాలని ఆయన అభిప్రాయపడ్డారు. రంగరాజన్ అభిప్రాయం ప్రకా రం.. ద్రవ్యోల్బణాన్ని 5 నుంచి 6 శాతం వరకు అనుమతించవచ్చు. చక్రవర్తి అభిప్రాయం మేరకు అది 4 శాతంగా ఉండాలి. అనుభవ

రిజర్వ్ బ్యాంకు - ద్రవ్య విధాన సాధనాలు

పరిమాణాత్మక పరపతి సాధనాలు	గుణాత్మక లేదా విచక్షణాత్మక పరపతి సాధనాలు	
ఎ) బ్యాంకు రేటు	1. మార్జిన్‌లను నిర్ణయించడం	2. పరపతి రేషనింగ్
బి) బహిరంగ మార్కెట్ చర్యలు	3. పరపతి నియంత్రణ	4. ప్రత్యక్ష చర్య
సి) నగదు-నిల్వల నిష్పత్తి	5. ప్రచారం	6. నైతిక ఉద్బోధ

పూర్వక ఆధారాల ప్రకారం మన దేశంలో ఏడు శాతం దాటిన ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థలో ప్రతికూల పరిస్థితులకు కారణమైంది.

ద్రవ్య విధాన సాధనాలు

సంస్కరణల ముందుకాలంలో ఆర్థిక ప్రణాళికల నేపథ్యంలో ద్రవ్య విధానాన్ని త్వరితగతిన వృద్ధి లక్ష్యంతో రూపొందించారు. 1990వ దశకంలో ద్రవ్యవిధానం దృష్టి పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన పరపతి విస్తరణను సూచిస్తుంది. అవసరమైన మేర ధరల స్థిరత్వం సాధ్యమైనప్పుడు పారిశ్రామికాభివృద్ధి వేగవంతమవుతుంది. ద్రవ్య సప్లయ్ నియంత్రణలో భాగంగా... పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు, గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలను ఆర్‌బీఐ ఉపయోగిస్తుంది. వాణిజ్య బ్యాంకులు సృష్టించే పరపతి పరిమాణాన్ని, పరపతి వ్యయాన్ని... కేంద్రబ్యాంకు తన విధానాల ద్వారా ప్రభావితం చేసి, ఆర్థిక వ్యవస్థలో మొత్తం పరపతి పరిమాణాన్ని నియంత్రించడాన్ని పరిమాణాత్మక పరపతి నియంత్రణ అంటారు. పరిమాణాత్మక పరపతి సాధనాల వల్ల పరపతికి సరళత ఏర్పడుతుంది. వివిధ ఆర్థిక రంగాలకు వాణిజ్య బ్యాంకులు ఇచ్చే పరపతిని ఏ విధంగా కేటాయించాలో.. వాటిని ఏ విధంగా, ఎటువంటి ప్రయోజనాల కోసం ఉపయోగించాలో ఆర్‌బీఐ నిర్ణయించి, దానికను గుణంగా విధానాలను, సాధనాలను రూపొందించే పద్ధతిని గుణాత్మక పరపతి నియంత్రణ అంటారు. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల ఉత్పత్తుల్లో ఒడిదుడుకులు లేకుండా ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి కోసం గుణాత్మక లేదా విచక్షణాత్మక పరపతి నియంత్రణకు ప్రాధాన్యమివ్వాలి. అప్పుడే ఆర్‌బీఐ వనరులను అభిలషణీయ రంగాల వైపు మళ్లించే అవకాశం కలుగుతుంది.

ద్రవ్యవిధానం – ఎస్. చక్రవర్తి కమిటీ

రిజర్వు బ్యాంకు ద్రవ్యవిధానంపై అధ్యయనం చేయడానికి 1982లో ప్రొఫెసర్ ఎస్. చక్రవర్తి అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ 1985లో నివేదికను సమర్పించింది. వనరుల సమీకరణ, వినియోగం సాంఘిక లక్ష్యాలను నెరవేర్చాలంటే ప్రణాళిక ప్రాధాన్యాలకు అనుగుణంగా ద్రవ్యవ్యవస్థ పనితీరులో స్థిరత్వం ఉండాలని అభిప్రాయపడింది. 1950-51 నుంచి 1983-84 మధ్యకాలంలో పొదుపు రేటు 10 శాతం నుంచి 23 శాతానికి పెరిగినప్పటికీ ఈ పొదుపు ప్రభుత్వ రంగంలో అవసరమైన పెట్టుబడులకు సరిపోలేదు. దీంతో ప్రభుత్వం లోటు బడ్జెట్ విధానాన్ని అవలంబించాల్సి వచ్చింది. ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ ఒత్తిడులు పెరిగాయి. ఈ నేపథ్యంలో.. ద్రవ్యోల్బణం ఏర్పడకుండా ప్రణాళికా కాలంలో విత్త వనరులను సమకూర్చుకోవాలని కమిటీ అభిప్రాయపడింది. అంతకు ముందుకంటే ప్రజల, ప్రభుత్వరంగ సంస్థల నుంచి పొదుపు పెంచాలి. రెవెన్యూ రాబడులు, వ్యయ విధులను నిర్వహించడంలో ప్రభుత్వ సమర్థత పెరగాలని కమిటీ అభిప్రాయపడింది. ద్రవ్యాధికారులు ధరల స్థిరత్వానికి ప్రాధాన్యమివ్వాలి. 1970 తర్వాత ద్రవ్య సప్లయ్ పెరుగుదలకు ప్రభుత్వానికి ఆర్‌బీఐ పరపతి పెరగడమే కారణం. వడ్డీరేట్ల నిర్ణయంలో బ్యాంకులకు స్వేచ్ఛ ఉండాలని, ప్రాధాన్యతా రంగాలకు రుణాలను మంజూరు చేసే పద్ధతికి అవసరమైన యంత్రాంగాన్ని మెరుగుపర్చాలని సూచించింది. ఫలితంగా తగు పరిమాణంలో ప్రాధాన్యతా రంగాలకు రుణాలు లభిస్తాయని పేర్కొంది. బ్యాంకు పరపతిని క్యాష్ క్రెడిట్ విధానం బదులు బిల్ ఫైనాన్సింగ్ ద్వారా సమకూర్చాలని సిఫార్సు చేసింది. ద్రవ్యవిధానాన్ని అనుసరించేప్పుడు పలు పద్ధతులను సంవిధానం చేయాలని.. ఆయా రంగాల్లో మార్పులను కాలక్రమేణా ప్రవేశపెట్టాలని కమిటీ అభిప్రాయపడింది.

ప్రాక్టీస్ బిట్స్

1. ప్రపంచంలో ఏర్పాటైన మొదటి కేంద్రబ్యాంక్ – రిక్స్ బ్యాంకు (Riks Bank) – 1656
2. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ప్రారంభం– 1694
3. ది బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్ ప్రారంభం – 1800
4. మనదేశంలో ద్రవ్యవిధానం ప్రవేశపెట్టేది – ఆర్‌బీఐ
5. ఆర్‌బిఐ ఏర్పాటైన సంవత్సరం – 1935 ఏప్రిల్ 1
6. రిజర్వ్ బ్యాంక్ జాతీయీకరణ – 1949 జనవరి 1
7. కేంద్రబ్యాంకు ప్రధాన విధి అంతిమ రుణదాతగా వ్యవహరించడం అని చెప్పింది – హాట్రే
8. ప్రభుత్వానికి 'వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్' ఇచ్చేది – ఆర్‌బీఐ
9. 1982లో ద్రవ్యవిధానంపై ఏర్పాటైన కమిటీ అధ్యక్షులు – చక్రవర్తి
10. M_1= ప్రజల వద్ద ఉండే కరెన్సీ నోట్లు, నాణేలు + బ్యాంకుల వద్ద ఉన్న డిమాండ్ డిపాజిట్లు + ఆర్‌బీఐ వద్ద ఉన్న ఇతర డిపాజిట్లు
11. $M_3 = M_1$ + బ్యాంకుల వద్ద ఉన్న కాలపరిమితి గల డిపాజిట్లు
12. ఏ రేటు వద్ద వాణిజ్యబ్యాంకుల బిల్లులను ఆర్‌బీఐ రీ డిస్కౌంట్ చేస్తుంది? – బ్యాంకు రేటు
13. దేశంలో బహిరంగ మార్కెట్ చర్యలను నిర్వహించేది – ఆర్‌బీఐ
14. వాణిజ్య బ్యాంకులు తమ డిపాజిట్లలో కొంతభాగాన్ని ఆర్‌బీఐ వద్ద ఉంచడాన్ని ఏమంటారు?
    నగదు-నిల్వల నిష్పత్తి
15. రిజర్వ్ బ్యాంక్ వాణిజ్య బ్యాంకులకిచ్చే స్వల్పకాలిక రుణాలపై ఉండే వడ్డీరేటు – రెపోరేటు

బ్యాంకులకే బ్యాంకు: రిజర్వు బ్యాంకు

ఆర్థిక వ్యవస్థ క్రమశిక్షణకు ద్రవ్య విధానాన్ని, కోశ విధానాన్ని నియంత్రించడం అవసరం. ఈ క్రమంలో ద్రవ్యపరమైన విధానాలను, ద్రవ్య మార్కెట్‌ను నియంత్రించేదే కేంద్రబ్యాంకు. అందుకే ప్రతి దేశానికీ కేంద్రబ్యాంకు స్థాపన అనివార్యం. మన దేశంలోని కేంద్రబ్యాంకును 'రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా'గా పిలుస్తారు.

ప్రజలు, ప్రభుత్వాల ఆర్థిక కార్యకలాపాల్లో ద్రవ్యం పాత్ర కీలకమైంది. కరెన్సీ నోట్లను జారీచేయడం, చలామణిలోని ద్రవ్య సప్లయ్‌ని అదుపులో ఉంచి.. ద్రవ్య సుస్థిరతను కాపాడడం, ద్రవ్య విధానాన్ని రూపొందించి అమలు పరచడం, అభివృద్ధి నిధులను ఏర్పాటుచేసి అభివృద్ధికి దోహదం చేయడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బ్యాంకరుగా, సలహాదారుగా వ్యవహరించడం, విదేశీ మారక నిల్వలను సంరక్షించడం, విదేశీ విత్తసంస్థలతో సమన్వయ కార్యకలాపాలు నిర్వహించడం వంటి విధులను ఆర్.బి.ఐ. నిర్వర్తిస్తుంది. పరపతి నియంత్రణలో ప్రధాన భూమికను పోషిస్తుంది. రెండు వేర్వేరు దేశాల్లోని కేంద్రబ్యాంకు విధుల్లో తేడా ఉన్నా స్థూలంగా లక్ష్యాలు ఒక్కటే.

కేంద్రబ్యాంకు పరిణామం

కేంద్రబ్యాంకు ఏర్పాటుపై నిర్దిష్ట విధానం 20వ శతాబ్దంలోనే జరిగింది. అంతకుముందు మొదట స్వీడన్‌లో 'రిక్స్ బ్యాంకు' (Riks Bank)ను 1656లో స్థాపించారు. దీనిని 1658లో స్టేట్ బ్యాంక్‌గా మార్చారు. ఆయా దేశాల్లో కేంద్ర బ్యాంకుల ఏర్పాటు క్రమం...

- 1694లో ది బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్
- 1800లో ది బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్
- 1814లో ది బ్యాంక్ ఆఫ్ నెదర్లాండ్స్
- 1856లో ది బ్యాంక్ ఆఫ్ స్పెయిన్
- 1860లో ది బ్యాంక్ ఆఫ్ రష్యా
- 1875లో ది రిస్చ్ బ్యాంక్ ఆఫ్ జర్మనీ
- 1826లో ది బ్యాంక్ ఆఫ్ జపాన్
- 1913లో ది ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ అమెరికా

1920 బ్రస్సెల్స్, 1922 బ్రెజిల్‌లలో జరిగిన International Finance Conferenceలో.. అప్పటివరకు కేంద్ర బ్యాంకు స్థాపించుకోలేని దేశాలు తక్షణమే ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు.

మన దేశంలో కేంద్రబ్యాంకు స్థాపన గురించి మొదటగా జె.ఎమ్. కీన్స్ ప్రస్తావించారు. భారత్‌లో Gold Standardను ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించడానికి 1913లో చాంబర్లీన్ కమిషన్‌ను నియమించారు. ఇందులో సభ్యుడైన జె.ఎమ్. కీన్స్ (J.M. Keynes) ఫ్రాన్స్‌లోని బ్యాంకింగ్ నమూనాలో భారత్‌లో కూడా కేంద్రబ్యాంకు ఉండాలని సూచించారు. 1921లో కలకత్తా, ముంబయి, మద్రాసు ప్రెసిడెన్సీ (Presidency) బ్యాంకులను విలీనం చేసి ఇంపీరియల్ బ్యాంకుగా ఏర్పాటుచేసి.. దానికి కేంద్రబ్యాంకు విధులు అప్పగించడం ముఖ్య పరిణామం. 1926లో ఏర్పడ్డ హిల్టన్ యంగ్ కమిషన్ భారతదేశంలోని కేంద్రబ్యాంకును'రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా'గా పేర్కొనాలని సూచించింది. ఈ కమిషన్ సూచన మేరకు 1931లో ఏర్పాటు చేసిన సెంట్రల్ బ్యాంకింగ్ ఎంక్వయిరీ కమిటీ కూడా ఆర్‌బీఐ స్థాపనకు పట్టుబట్టింది. దీంతో 1933 సెప్టెంబర్ 8న రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా అనే బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. 1934 మార్చి 6న గవర్నర్ జనరల్ ఆమోదంతో ఆర్‌బీఐ చట్టం రూపొందింది.

1934 ఆర్‌బీఐ చట్టం ప్రకారం ఆర్‌బీఐను 1935 ఏప్రిల్ 1న ప్రైవేటు వాటాదారులతో స్థాపించారు. ప్రైవేటు యాజమాన్యంలోని బ్యాంకుకు కేంద్రబ్యాంకు విధులు అప్పగించాలా? వద్దా? అనే చర్చ 1948 వరకు జరిగింది. (ఈ కాలంలో Imperial Bank కేంద్ర బ్యాంకుగా వ్యవహరించింది)

ఆర్‌బీఐ, ప్రభుత్వాలకు మధ్య ద్రవ్య, పరపతి విధానాల్లో సంపూర్ణ సమ న్వయం ఉండటానికి, 1929– 33 నాటి ఆర్థికమాంద్యం దృష్ట్యా ఆర్థిక సుస్థిరతను చేకూర్చడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టాల్సి వచ్చింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం అభివృద్ధిలో ప్రభుత్వ భాగస్వామ్యం పెరిగిన పరిస్థితుల్లో ఆర్‌బీఐని జాతీయం చేయాలనే వాదన తలెత్తింది. ఫలితంగా 1948లో 'ఆర్‌బీఐ జాతీయీకరణ చట్టం' ప్రవేశపెట్టి, 1949 జనవరి 1న జాతీయం చేశారు. ఈ విధంగా ఆర్‌బీఐ 'ప్రైవేటు సంస్థ నుంచి ప్రభుత్వాధీన సంస్థ'గా మార్పు చెందింది. అప్పటి నుంచి 50 మిలియన్ల రూపాయలు మూలధనంలోనూ, 50 మిలియన్లు రిజర్వు నిధితో ఆర్‌బీఐ కేంద్ర బ్యాంకు విధులను నిర్వహిస్తోంది.

రిజర్వు బ్యాంకు నిర్వహణ

20 మంది సభ్యులుండే కేంద్రపాలక వర్గం ద్వారా సాధారణ పరిపాలన జరుగుతుంది. ఆ సభ్యుల వివరాలు..

1. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఒక గవర్నరు, నలుగురు డిప్యూటీ గవర్నర్లు ఉంటారు. వీరి కాలపరిమితి 5 సంవత్సరాలు.
2. ప్రభుత్వం నియమించిన ఒక ఉన్నతాధికారి.
3. నాలుగు ప్రాంతీయ బోర్డులుంటాయి. (ముంబయి, ఢిల్లీ, కలకత్తా, మద్రాసు) వీటికి నలుగురు డైరెక్టర్లు ఉంటారు.
4. కేంద్ర ప్రభుత్వం నియమించిన పది మంది అధి కారిక డైరెక్టర్లు

ఉంటారు. కాలపరిమితి నాలుగు సంవత్సరాలు. ప్రతి సంవత్సరం ఇద్దరు చొప్పు న రొటేషన్ పద్ధతిపై పదవీ విరమణ చేస్తారు.

5. ప్రాంతీయ బోర్డులో ఐదుగురు సభ్యులుంటారు. కాలపరిమితి 4 సంవత్సరాలు. (వీరు కేంద్రపా లక వర్గంలో సభ్యులు కారు)

మన ఆర్‌బీఐ కేంద్ర కార్యాలయం ముంబయిలో ఉంది. బ్యాంకు ప్రధాన కార్యనిర్వహణాధికారిగా గవర్నర్ వ్యవహరిస్తారు. ఆయనకు మరో నలుగురు డిప్యూటీ గవర్నర్లు తోడ్పడతారు. ఆర్‌బీఐలో మొత్తం 16 విభాగాలు ఉంటాయి. వీటి నిర్వహణను డిప్యూటీ గవర్నర్లకు అప్పగిస్తారు. "Financial Market Department' అనేది 16వ విభాగం. దీనిని జూలై 6, 2005న ఏర్పాటు చేశారు. కేంద్రపాలక వర్గం కనీసం ప్రతి మూడు నెలలకొకసారి తక్కువ కాకుండా ఏడాదిలో ఆరు సార్లు సమావేశం అవుతుంది. రిజర్వుబ్యాంకు తన కార్యకలాపాలను సమర్థంతంగా నిర్వహించడానికి దేశంలో అనేక ప్రాంతాల్లో ఉపశాఖ లను ఏర్పాటు చేసింది. ఇవి లేనిచోట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిజర్వు బ్యాంకు ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. లండన్‌లోనూ ఆర్‌బీఐ కార్యాలయం ఉంది. సెప్టెంబరు 9, 1996న Bank of International Set- tlement'లో సభ్యత్వం తీసుకుంది. BI అనేది 1930లో BASLE (స్విట్జర్లాండ్‌లో) ఏర్పడింది. అన్ని దేశాల కేంద్ర బ్యాంకులకు ఇది సలహాలు, సూచనలు అందిస్తుంది.

ప్రాక్టీస్ బిట్స్

1. దేశ ద్రవ్య విధానానికి అపెక్స్ సంస్థ ఏది?
   ఎ) ఆర్థిక శాఖ బి) భారతీయ స్టేట్ బ్యాంక్
   సి) భారతీయ రిజర్వు బ్యాంక్ డి) ప్రపంచ బ్యాంకు

2. రిజర్వు బ్యాంకు ఈ విధంగా ఏర్పడింది?
   ఎ) ప్రైవేటు వాటాదారులు బి) ప్రభుత్వ వాటాదారులు
   సి) ప్రైవేటు, ప్రభుత్వ వాటాదారులు
   డి) ఆంగ్లేయ వాటాదారులు

3. భారతదేశంలో కేంద్రబ్యాంకు ఏర్పాటు చేయాల ని మొదటగా సూచించింది?
   ఎ) హిల్టన్ యంగ్ బి) జె.ఎమ్. కీన్స్
   సి) చాంబర్లీన్ డి) కర్జన్

4. IMFలో ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరించేది?
   ఎ) ఆర్థిక మంత్రి బి) ఎస్‌బీఐ
   సి) ఆర్థికశాఖ కార్యదర్శి డి) ఆర్‌బీఐ

5. మొదటి ఆర్‌బీఐ గవర్నర్ ఎవరు?
   ఎ) కె.సి. నియోగి బి) సి.డి. దేశ్‌ముఖ్
   సి) క్రిష్ణమాచారి డి) దలాల్

6. భారతదేశ కేంద్రబ్యాంకుకు, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాగా పేరు సూచించింది?
   ఎ) బ్యాంకింగ్ విచారణ కమిటీ
   బి) చాంబర్లీన్ కమిషన్ సి) జె.ఎమ్. కీన్స్
   డి) హిల్టన్ యంగ్ కమిషన్

7. రిజర్వు బ్యాంకు బిల్లు చట్టంగా మారిన తేది?
   ఎ) 1933, సెప్టెంబర్ 8 బి) 1934, ఆగస్టు 6
   సి) 1934, మార్చి 6 డి) 1934, అక్టోబర్ 8

8. రిజర్వు బ్యాంకు పాలకవర్గంలో సభ్యుల సంఖ్య
   ఎ) 11 బి) 25 సి) 21 డి) 20

9. రిజర్వు బ్యాంకు జాతీయీకరణ జరిగిన తేదీ?
   ఎ) 1.1.1949 బి) 1.10.1949
   సి) 11.1.1949 డి) 1.12.1949

10. రిజర్వు బ్యాంకు ఏర్పడ్డప్పుడు కోటాలను ప్రాంతీయ ప్రయోజ నాల ప్రాతిపదికగా కేటాయించడానికి దేశాన్ని ఐదు ప్రాంతాలుగా విభజించారు. అవి ఏవి?
   ఎ) కలకత్తా, ఢిల్లీ, లాహోర్, రంగూన్, ఢాకా
   బి) కలకత్తా, మద్రాసు, కరాచి, రంగూన్, ఢాకా
   సి) ఢిల్లీ, కలకత్తా, ముంబయి, లాహోర్, ఢాకా
   డి) ఢిల్లీ, కలకత్తా, ముంబయి, మద్రాసు, రంగూన్

11. భారతీయ రిజర్వు బ్యాంకు కేంద్ర కార్యాలయం
   ఎ) ఢిల్లీ బి) కలకత్తా
   సి) ముంబయి డి) మద్రాసు

12. ప్రపంచంలో మొదటి కేంద్ర బ్యాంకు?
   ఎ) రిక్స్ బ్యాంకు బి) ఆర్‌బీఐ
   సి) బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్
   డి) ఫెడరల్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ అమెరికా

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10	11	12
	C	A	B	D	B	D	C	D	A	D	C	A

రిజర్వు బ్యాంకు అజమాయిషీ, కార్యకలాపాలు

రిజర్వు బ్యాంకు నిర్వహించే విధుల్లో పరపతి నియంత్రణ చాలా ముఖ్యమైంది. ద్రవ్య పరిమాణాన్ని నియంత్రణ చేసి, ద్రవ్య విలువను స్థిరీకరించడంపైనే ప్రజల జీవనప్రమాణం ఆధారపడి ఉంటుంది. 1949 బ్యాంకింగ్ నిబంధనలు ప్రవేశపెట్టకముందు పరపతి నియంత్రణ కోసం బ్యాంకురేటు, బహిరంగ మార్కెట్ వ్యవహారాలపై ఆధారపడవలసి వచ్చేది. బ్యాంకింగ్ నిబంధనల చట్టం 1949 ద్వారా పరపతి నియంత్రణ కోసం ఆర్‌బీఐకి విస్తృత అధికారాలు లభించాయి. 1949 చట్టం సెక్షన్ 21(1), 21(2), 35 ఎ(1), 35 ఎ(2), 36 (1)(ఎ) ప్రకారం అనేక సెలక్టివ్ పరపతి సాధనాలను (అంటే గుణాత్మక సాధనాలను) ఉపయోగించారు. కొన్ని ఎంపిక చేసిన పరిశ్రమలకే పరపతిని కల్పిస్తూ, మిగతావాటికి నిరాకరిస్తారు. స్పెక్యులేటివ్ ప్రయోజనాలకు రుణ సౌకర్యం కల్పించరు. ఈ సెలెక్టివ్ పరపతి విధానాన్ని 1956 నుంచి అమలు చేస్తోంది. బ్యాంకురేటు, రెపోరేటు, నగదు నిల్వల నిష్పత్తి, బహిరంగ మార్కెట్ వ్యవహారాలు, చట్టబద్ధ ద్రవ్యరాశి మొదలైనవి పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు.

బ్యాంకురేటు: ఆర్‌బీఐ వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే అప్పులపై వసూలు చేసే వడ్డీరేటు

నగదు నిల్వల నిష్పత్తి (CRR): 1934 ఆర్‌బీఐ చట్టం, సెక్షన్ 42(1) ప్రకారం వాణిజ్య బ్యాంకులు తమ వివిధ రకాల డిపాజిట్ల ద్రవ్యం నుంచి గరిష్టంగా 15 శాతం నిధులు ఆర్‌బీఐ వద్ద రిజర్వుగా ఉంచాలి. కనిష్టంగా ఎంత ఉంచాలి అనేది ఆర్‌బీఐ విచక్షణపై ఆధారపడి ఉంటుంది. (RBI Bill May 17, 2006 ప్రకారం) CRR విధానాన్ని మొదటగా 1960లో అమలు చేశారు.

చట్టబద్ధ ద్రవ్యరాశి (SLR): వాణిజ్య బ్యాంకులు తమ డిపాజిట్ల మొత్తం నుంచి ప్రభుత్వ సెక్యూరి టీస్‌లలో ఉంచాల్సిన మొత్తం. దీని గరిష్ట పరిమితి 40 శాతం. ప్రస్తుతం ఇది 25 శాతంగా ఉంది.

- CRR, SLRలను VRR (Variable Reserve Ratio) అంటారు.

రెపోరేటు (Re purchasing option Rate) :

3 నుంచి 14 రోజుల కాలపరిమితిలో తిరిగి కొనుగోలు చేస్తామనే హామీపై వాణిజ్య బ్యాంకులు తమ సెక్యూరిటీలను ఆర్‌బీఐ వద్ద డిస్కౌంట్ చేసుకొనే రేటునే రెపోరేటు అంటారు. ఇది ఆర్‌బీఐ వసూలు చేసే స్వల్పకాలిక వడ్డీరేటు.

బహిరంగ మార్కెట్ వ్యవహారాలు: కేంద్రబ్యాంకు ప్రభుత్వ సెక్యూరిటీలను బహిరంగ మార్కెట్లో అమ్మడాన్ని లేదా కొనడాన్ని బహిరంగ మార్కెట్ వ్యవహారాలు అంటారు. ప్రభుత్వ సెక్యూరిటీ లను అమ్మినపుడు బ్యాంకులు వాటిని కొని తమ నగదును ఆర్‌బీఐకి చెల్లించడం ద్వారా పరపతి తగ్గుతుంది. ఆర్‌బీఐ చట్టం 1934 సెక్షన్ 17(8) ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సెక్యూరిటీలను కొనుగోలు చేయడానికి, అమ్మడానికి ఆర్‌బీఐకి తగిన అధికారాలు ఉన్నాయి. పై విధానాలను పెంచడం ద్వారా మార్కెట్లో బ్యాంకులు సృష్టించే పర పతిని తగ్గించి ద్రవ్యోల్బణం అరికట్టవచ్చు.

రివర్స్ రెపోరేటు: తిరిగి నిర్ణీత కాలంలో కొంటాననే ఒప్పందం మేరకు ఆర్‌బీఐ తన బాండ్లను వాణిజ్య బ్యాంకులకు అమ్మేటపుడు ప్రకటించే వడ్డీరేటు. ప్రారంభంలో రెపో కనిష్ట కాలపరిమితి 3 రోజులు. దానిని తర్వాత 14 రోజులకు పెంచారు. రెపో విధానాన్ని ఆర్‌బీఐ 1992 డిసెంబర్ 10 నుంచి అమలు చేస్తోంది.

విదేశీ మారకద్రవ్య సంరక్షణ:

ఎగుమతిదార్లు ఆర్జించిన విదేశీ మారక నిల్వలను జాగ్రత్తగా సంర క్షించి అవసరమైన వస్తువుల దిగుమతికి మాత్రమే కేటాయిస్తూ ని యంత్రిస్తుంది. మారక రేటును స్థిరీకరించడానికి చర్యలు తీసుకొం టుంది.

అభివృద్ధి విధులు:

రిజర్వు బ్యాంకు ఒక పక్క తన సంప్రదాయ సిద్ధమైన బ్యాంకింగ్ విధులను నిర్వహిస్తూ, మరోవైపు దేశార్థికాభివృద్ధికే ప్రధానపాత్ర వహిస్తుంది. ఆర్‌బీఐ చట్టం 1934, సెక్షన్ 34 ప్రకారం వ్యవసాయ పరపతి విభాగాన్ని నెలకొల్పింది. సెక్షన్ 17 ప్రకారం రాష్ట్ర సహకార బ్యాంకుల ద్వారా, షెడ్యూల్డ్ బ్యాంకుల ద్వారా వ్యవసాయ కార్యక్రమాలకు పరపతిని అందుస్తుంది.

SFDA, MFALDA కింద గుర్తింపు పొందిన చిన్న, సన్న కారు రైతులకు తక్కువ వడ్డీలకు రుణాలను నాబార్డ్ ద్వారా కల్పిస్తుంది. పారిశ్రామిక రంగాభివృద్ధికి కూడా ఐ.డి.బి.ఐ. ద్వారా తోడ్పడుతుంది.

ప్రాక్టీస్ ప్రశ్నలు

1.వాణిజ్య బ్యాంకుల నగదును వేగంగా పెంచడానికిగానీ, తగ్గించడానికి గానీ ఆర్‌బీ ఐకి ఉపయోగపడే సాధనం?

ఎ) బహిరంగ మార్కెట్ వ్యవ హారాలు

బి) రెపో విధానం

సి) SLR విధానం డి) VRR విధానం

2. ఆర్‌బీఐ విధించే సెలెక్టివ్ పరపతి విధానంలో భాగం కానిది

ఎ) మార్జిన్ల నియంత్రణ

బి)రుణస్తుడికి ఇచ్చే అప్పు పరిమాణం నియంత్రణ

సి) వడ్డీరేటు నియంత్రణ డి) బహిరంగ మార్కెట్ వ్యవహారాలు

3. ఆర్‌బీఐ క్రెడిట్ ఆథరైజేషన్ స్కీం (1965) దేనికి సంబంధించింది?

ఎ) చిన్నతరహా సంస్థలు దేశీయ సాంకేతిక విజ్ఞానం పొందడానికి ఇచ్చే రుణాలు

బి) వాణిజ్య బ్యాంకులు రూ. 7 కోట్లకు పైబడిన రుణాల మంజూరుకు ఆర్‌బీఐ అనుమతి గురించి

సి) తాకట్టు రుణాలపై మార్జిన్ నిర్ణయించడం

డి) కంపెనీలు వాటాలు విడుదల చేసేముందు వాణిజ్య బ్యాంకుల అనుమతి గురించి

4.బ్యాంక్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ సెటిల్‌మెంట్‌లో సభ్యత్వం కలిగిన బ్యాంకు?

ఎ) సిండికేట్ బ్యాంకు బి) ఎస్‌బీఐ

సి) కెనరా బ్యాంకు డి) ఆర్‌బీఐ

5.మారకపు రేటును స్థిరీకరించే చర్యలు చేపట్టేది?

ఎ) ప్రభుత్వం బి) ఆర్‌బీఐ

సి) పార్లమెంటు డి) వాణిజ్య మంత్రిత్వ శాఖ

6.1991 నరసింహం కమిటీ సిఫార్సుల అనుగుణంగా వాణిజ్య రుణాలపై నియంత్రిణాధికారం ఎవరిది?

ఎ) కేంద్రప్రభుత్వానిది బి)RBI

సి) కేంద్రం, RBI డి) RBI, ఆర్థికశాఖ

7.దేశంలో స్వాతంత్ర్యనంతరం జాతీయం చేసిన మొదటి బ్యాంకు ఏది?

ఎ) SBI బి)ఇంపీరియల్ బ్యాంకు

సి)RBI డి) దేశీయబ్యాంకులు

8.వాణిజ్యబ్యాంకుల కేపిటల్ అడిక్వసీ రేషియో (CAR) నిబంధన లను రూపొందించింది ఏవరు?

ఎ)పార్లమెంటు బి) కేంద్ర ఆర్థిక శాఖ

సి) బ్యాంకింగ్ రెగ్యులేటరీ కమిషన్ డి)RBI

9.పారిశ్రామిక రంగానికి ఆర్థిక సహాయం నిమిత్తం ఏర్పాటు చేసిన బ్యాంకు?

ఎ)IDBI బి)IFCI సి)NABARD డి) UTI

10.రిజర్వు బ్యాంకు 2007-08 ద్రవ్యవిధానం సమీక్ష ముఖ్య నిర్ణయం?

ఎ) NRI నుంచి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు విదేశీ కరెన్సీని ఆమోదించవచ్చు

బి) ద్రవ్య నియంత్రణాధికారాన్ని కేంద్రప్రభుత్వంతో RBI పంచుకోవడం

సి) విదేశీ వాణిజ్య విధానాన్ని RBI నిర్ణయించడం

డి) విదేశాల్లోని ముఖ్యనగరాల్లో RBI బ్రాంచీలను ఏర్పాటు చేయడం

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10
	A	D	B	D	B	B	C	D	A	A

రిజర్వు బ్యాంకు కార్యకలాపాలు

ఆర్‌బీఐ విధులను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు

I. బ్యాంకింగ్ కార్యకలాపాలు

II. అజమాయిషీ కార్యకలాపాలు

III. అభివృద్ధి కార్యకలాపాలు

I. బ్యాంకింగ్ కార్యకలాపాలు

1) కరెన్సీ నోట్ల జారీ: ఆర్‌బీఐ చట్టం 1934, సెక్షన్ 22 ప్రకారం కరెన్సీ నోట్లు (ఒక రూపాయి నోటు, నాణాలు మినహా) ముద్రించి జారీ చేసే అధికారం ఒక్క ఆర్‌బీఐకే ఉంది. ద్రవ్య సుస్థిరతను కాపాడటానికి నోట్ల ముద్రణను గుత్తాధిపత్యంగా ఆర్‌బీఐకి అప్పగించారు. ముద్రించి విడుదల చేసిన కరెన్సీకి విలువను చేకూర్చడానికి నోట్లు ముద్రించేప్పుడు కొంత ఆస్తిని (బంగారం తదితరాలు)ప్రభుత్వం ఆర్‌బీఐ వద్ద తాకట్టుగా పెడుతుంది.

1956కు పూర్వం నైష్పత్తిక పద్ధతి అమలులో ఉండేది. జారీ అయ్యే నోట్ల మొత్తం విలువకు 40 శాతం(2/5) తక్కువ కాకుండా బంగారం, విదేశీ సెక్యూరిటీలుండాలి. 1956లో దీనిని కనిష్ట నిల్వల జారీ పద్ధతిగా మార్చారు. కనిష్టంగా 115 కోట్లకు బంగారం తాకట్టు పెట్టి, ఎంత విలువ కరెన్సీ అయినా ముద్రించడం జరిగేది. కానీ 1957 నుంచి దీన్ని కొద్దిగా సవరించారు. 115 కోట్లకు బంగారాన్ని, 85 కోట్లకు విదేశీమారక ద్రవ్యం, సెక్యూరిటీలను మొత్తంగా 200 కోట్ల కనీస ఆస్తిని తాకట్టుగా మార్చారు.

2) బ్యాంకర్లకు బ్యాంకు: వాణిజ్య బ్యాంకులు ప్రజ ల కోసం ఎలాంటి విధులు నిర్వహిస్తాయో, అవే విధులను ఆర్‌బీఐ, వాణిజ్య బ్యాంకుల కోసం నిర్వహిస్తుంది. అంతేకాక ఆ బ్యాంకులకు చివరి రుణదాతగా కూడా వ్యవహరిస్తుంది. వాణిజ్య బ్యాంకులకు షెడ్యూల్డ్ హోదా ఇస్తుంది. రిజర్వు బ్యాంకు చట్టం 1934 షెడ్యూల్డ్ రెండులో నమోదయ్యే బ్యాంకులను షెడ్యూల్డ్ బ్యాంకులంటారు. అందుకు ఆ బ్యాంకులకు కింది నిబంధనలు ఉండాలి.

- భారతదేశంలో వ్యాపారం చేస్తున్న బ్యాంకులై ఉండాలి
- రాష్ట్ర సహకార బ్యాంకులు లేదా బ్యాంకింగ్ కంపెనీలై ఉండాలి
- చెల్లించిన మూలధనం రూ. 5 లక్షల రూపాయల విలువైనదిగా ఉండాలి
- డిపాజిట్‌దారుల ప్రయోజనాలకు హాని చేయరాదు
- నగదు నిల్వల నిష్పత్తి నిబంధనలు పాటించాలి
- ఆర్‌బీఐ నియంత్రణకు లోబడి ఉండాలి

వాణిజ్య బ్యాంకులు తమ సెక్యూరిటీల ప్రాతిపదికగా ఆర్‌బీఐ వద్ద అప్పులు పొందవచ్చు. బ్యాంకుల ఏర్పాటు, నిర్వహణలో ఆర్‌బీఐ తగు సలహాలు, సూచనలు ఇస్తుంది.

3) ప్రభుత్వ బ్యాంకర్: ఆర్‌బీఐ చట్టం 1934, సెక్షన్ 20, 21 ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి, సెక్షన్ 21(ఎ) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు బ్యాంకర్‌గా వ్యవహరిస్తుంది. కేంద్ర ప్రభుత్వం తరపున ద్రవ్యాన్ని స్వీకరిస్తుంది, చెల్లిస్తుంది. ఆర్థికమాంద్య పరిస్థితుల్లో, యుద్ధకాలాల్లో, అత్యవసర పరిస్థితుల్లో అసాధారణ రుణాలు మంజూరు చేయడం, విదేశీ ద్రవ్యాల కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన ప్రభుత్వ లావాదేవీలు వంటి విధులను నిర్వహిస్తుంది. మార్కెట్లో ద్రవ్య పరిమాణం పెరిగినపుడు తన వద్ద ఉన్న ప్రభుత్వ బాండ్లను అమ్మడం, ద్రవ్య పరిమాణం తగ్గినపుడు ప్రభు త్వ బాండ్లను కొనడం ద్వారా ద్రవ్య నియంత్రణచే స్తుంది. బ్యాంకింగు విత్తవ్యవహారాలతోపాటు, ఆర్థిక విషయాల్లోనూ సలహాదారునిగా వ్యవహరిస్తుంది. పంచవర్ష ప్రణాళికలు, వనరుల సమీకరణ, పరపతి సౌకర్యాల కల్పన, అంతర్జాతీయ విత్త విధానం మొదలైన వాటిపై ప్రభుత్వానికి సాంకేతిక పరిజ్ఞానం అందిస్తుంది.

ప్రాక్టీస్ ప్రశ్నలు

1.రిజర్వు బ్యాంకు కింది ఏ సిబ్బంది పదవీకాలం నాలుగు సంవత్సరాలు ఉంటుంది?

ఎ) గవర్నరు, డిప్యూటీ గవర్నర్లు

బి) డిప్యూటీ గవర్నర్లు - ప్రాంతీయ బోర్డు డైరెక్టర్లు

సి) ప్రాంతీయ బోర్డు డైరెక్టర్లు

డి) డిప్యూటీ గవర్నర్లు

2.1934 ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 22 ప్రకారం?

ఎ) ఆర్‌బీఐ, ఫారెక్స్ సంరక్షిస్తుంది

బి) నోట్లను ముద్రించే అధికారం ఆర్‌బీఐకే ఉంది

సి) పరపతి నియంత్రణాధికారం ఆర్‌బీఐకే ఉంది

డి) రాష్ట్రాలకు ఆర్థిక సహాయం చేస్తుంది

3.ఆర్‌బీఐలో ఆర్థిక శాఖ ప్రతినిధులు ఎందరుంటారు?

ఎ) 1 బి) 4 సి) 10 డి) 5

4.కరెన్సీ నోట్ల ముద్రణకు రిజర్వు బ్యాంకు ప్రస్తుతం పాటించే పద్ధతి

ఎ) నైష్పత్తిక పద్ధతి బి) గరిష్ట నోట్ల జారీ పద్ధతి

సి)విదేశీ ద్రవ్య నిల్వల జారీ పద్ధతి డి) కనిష్ట రిజర్వు పద్ధతి

5.1949కి ముందు భారత్‌లో కేంద్రబ్యాంకు?

ఎ) ఇంపీరియల్ బ్యాంకు బి) భారతీయ స్టేట్ బ్యాంకు

సి) అలెగ్జాండర్ అండ్ కంపెనీ డి) ప్రెసిడెన్షియల్ బ్యాంకు

6. రిజర్వు బ్యాంకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు బ్యాంకరుగా వ్యవహరిస్తుంది. కానీ ఒక రాష్ట్రానికి ఈ విధిని నిర్వర్తించదు. ఆ రాష్ట్రం?

ఎ) సిక్కిం బి) తమిళనాడు

సి) నాగాలాండ్ డి) జమ్ము, కాశ్మీర్

7.కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు Ways & Means రుణాలను ఆర్‌బీఐ కల్పిస్తుంది. వీటి స్వభావం?

ఎ) తిరిగి మూడు నెలల కాలంలో చెల్లించాలి

బి) తిరిగి చెల్లించనవసరం లేదు

సి) తిరిగి సంవత్సరం లోపు చెల్లించాలి

డి) ద్రవ్యోల్బణం ఉన్నపుడే తిరిగి చెల్లించాలి

8.సెలెక్టివ్ పరపతి నియంత్రణను ఆర్‌బీఐ ఎప్పటి నుంచి పాటిస్తుంది?

ఎ) 1949 బి)1935 సి) 1956 డి) 1950

9.ఒక వాణిజ్య బ్యాంకు కొత్తగా శాఖను ఏర్పాటు చేయడానికి?

ఎ) ఆర్‌బీఐ అనుమతి తప్పనిసరి

బి) ఆర్‌బీఐ అనుమతి అవసరం లేదు

సి) ఆర్‌బీఐ, ప్రభుత్వ అనుమతి అవసరం

డి) ఆర్‌బీఐ పాక్షిక అనుమతి అవసరం

10.ఆర్‌బీఐ ప్రధాన విధి?

ఎ) పరపతి నియంత్రణ బి) విదేశీ ద్రవ్య సంరక్షణ

సి) నోట్ల ముద్రణ డి) ప్రభుత్వ బ్యాంకరు

11.విదేశాల్లోని ఏ నగరంలో ఆర్‌బీఐ బ్రాంచి ఉంది?

ఎ) వాషింగ్టన్ బి) లండన్

సి) టోక్యో డి) కరాచి

12.కింది ఏ ద్రవ్య నియంత్రణ చర్యను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు?

ఎ) బ్యాంకు రేటు బి) CRR

సి) రెపో రేటు డి) SLR

13.వాణిజ్య బ్యాంకులు తమ డిపాజిట్ ద్రవ్యంలో కనీసం 25 శాతం నగదు, బంగారం, సెక్యూరిటీలలో నిల్వగా ఉంచడాన్ని ఏమంటారు?

ఎ) నగదు నిల్వల నిష్పత్తి బి) చట్టబద్ధ ద్రవ్యరాశి

సి) మార్జిన్లు డి) ప్రామాణిక ద్రవ్యరాశి

జవాబులు	1	2	3	4	5	6	7	8	9	10	11	12	13
	C	B	A	D	A	D	A	C	B	A	B	D	B

ఆర్‌బీఐ ద్రవ్య విధానం.... నియంత్రణ చర్యలు

దేశంలో చట్టబద్ధమైన ద్రవ్యాన్ని రిజర్వ్ బ్యాంక్ జారీ చేస్తుంది. దాని ఆధారంగా వాణిజ్య బ్యాంకులు పరపతి ద్రవ్యాన్ని సృష్టిస్తున్నాయి. ఈ రెండు రకాల ద్రవ్యాలను కలిపితే ఆర్థిక వ్యవస్థలో చెలామణిలో ఉన్న ద్రవ్యం తెలుస్తుంది. బ్యాంకులు సృష్టించే పరపతి పెరిగినప్పుడు చెలామణిలో ఉన్న ద్రవ్య సరఫరా పెరిగి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడతాయి. పరపతి తగ్గినప్పుడు ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడతాయి. అందువల్ల ద్రవ్యాన్ని "మంచి సేవకుడు, చెడ్డ యజమాని" అని వర్ణిస్తారు.

ఆర్థిక వ్యవస్థకు ద్రవ్య సుస్థిరతను చేకూర్చడం రిజర్వ్ బ్యాంక్ ప్రధాన లక్ష్యం. కాబట్టి వాణిజ్య బ్యాంకులు సృష్టించిన పరపతిని ఆర్‌బీఐ నియంత్రిస్తుంది. పరపతి నియంత్రణ కోసం కేంద్ర బ్యాంక్ (ఆర్‌బీఐ) అనుసరించే విధానాన్ని ద్రవ్యవిధానం అంటారు.

ద్రవ్య లేదా పరపతి విధాన సాధనాలు

పరపతిని ఆర్‌బీఐ రెండు విధాలుగా నియంత్రిస్తుంది.

- పరిమాణాత్మక పరపతి నియంత్రణ చర్యలు
- గుణాత్మక లేదా ఎంపిక చేసిన పరపతి నియంత్రణ చర్యలు

పరిమాణాత్మక నియంత్రణ చర్యలు

పరపతి పరిమాణాన్ని, వ్యయాన్ని రిజర్వ్‌బ్యాంక్ మూడు విధాలుగా నియంత్రిస్తుంది.

ఎ) బ్యాంకింగ్ రేటు విధానం
బి) బహిరంగ మార్కెట్ వ్యవహారాలు
సి) నగదు నిల్వల నిష్పత్తి

బ్యాంక్ రేట్: వాణిజ్య బ్యాంకులు తమ వద్దగల ప్రథమ శ్రేణి సెక్యూరిటీలను హామీగా పెట్టి రిజర్వ్ బ్యాంక్ నుంచి రుణాలు తీసుకుంటాయి. ఈ రుణాలకు విధించే వడ్డీనే బ్యాంక్ రేట్ లేదా రీడిస్కౌంట్ రేట్ అంటారు. ఈ బ్యాంక్ రేట్‌ను రిజర్వ్‌బ్యాంక్ ద్రవ్యోల్బణ సమయంలో పెంచి, ఆర్థిక మాంద్యం వచ్చినప్పుడు తగ్గిస్తుంది.

బహిరంగ మార్కెట్ వ్యవహారాలు: రిజర్వ్ బ్యాంక్ తన వద్ద ఉన్న ప్రభుత్వ సెక్యూరిటీలను బహిరంగ మార్కెట్‌లో ప్రజలకు, వాణిజ్య బ్యాంకులకు, ఇతర ఆర్థిక సంస్థలకు అమ్మడాన్ని లేదా కొనడాన్ని బహిరంగ మార్కెట్ చర్యలు అంటారు. రిజర్వ్ బ్యాంక్ విక్రయించే ప్రభుత్వ సెక్యూరిటీలను కొన్నప్పుడు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల వద్దనున్న అదనపు ద్రవ్యం ఆర్‌బీఐకి బదిలీ అవుతుంది. ఫలితంగా బ్యాంకుల పరపతి సృష్టి సామర్థ్యం తగ్గుతుంది. ద్రవ్యోల్బణ కాలంలో అమ్మిన ప్రభుత్వ సెక్యూరిటీలను, ఆర్థికమాంద్యం తలెత్తినప్పుడు ఆర్‌బీఐ తిరిగి కొనుగోలు చేస్తుంది.

రెపో, రివర్స్‌రెపో: రెపో రేటు అనేది స్వల్పకాలానికి సంబంధించింది (సాధారణంగా 15 రోజులు). 1992లో దీన్ని ప్రవేశపెట్టారు. వాణిజ్య బ్యాంకుల వద్ద నగదు నిల్వల కొరత ఉన్నప్పుడు అవి ప్రభుత్వ సెక్యూరిటీలను హామీగా పెట్టి రిజర్వ్‌బ్యాంక్ నుంచి రుణాలు తీసుకుంటాయి. ఈ స్వల్ప కాలానికి ఆర్‌బీఐకి చెల్లించే వడ్డీరేటే రెపో. రివర్స్ రెపోరేటును 1996లో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ పత్రాలను హామీగా పెట్టి బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ చెల్లించే వడ్డీరేటే రివర్స్ రెపో.

నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్): చట్టబద్ధంగా వాణిజ్య బ్యాంకులు తమ వద్దగల మొత్తం డిపాజిట్లలో కొంత నగదు నిష్పత్తిని రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉంచాలి. దీనినే నగదు నిల్వల నిష్పత్తి అంటారు. దీన్ని మార్చడం ద్వారా పరపతి పరిమాణాన్ని పెంచవచ్చు. సీఆర్‌ఆర్ 5 శాతం అయితే పరపతి పరిమాణం 20 రెట్లు పెరుగుతుంది. సీఆర్‌ఆర్ 10 శాతం అయితే పరపతి పరిమాణం 10 రెట్లు పెరుగుతుంది. సీఆర్‌ఆర్ 20 శాతం అయితే పరపతి పరిమాణం 5 రెట్లు పెరుగుతుంది. అంటే పరపతి పరిమాణానికి, సీఆర్‌ఆర్‌కి విలోమ సంబంధం ఉంటుంది. ద్రవ్యోల్బణ కాలంలో రిజర్వ్ బ్యాంక్ సీఆర్‌ఆర్‌ను పెంచి ఆర్థికమాంద్యం కాలంలో తగ్గిస్తుంది.

SLR (Statutory Liquidity Ratio): సీఆర్‌ఆర్‌కి అదనంగా ప్రతీ వాణిజ్యబ్యాంక్ తన మొత్తం డిపాజిట్లలో కొంతభాగాన్ని నగదు గానీ, బంగారం రూపంలోగానీ, ప్రభుత్వ సెక్యూరిటీల రూపంలో గానీ తన వద్దే ఉంచుకోవాలి. దీనినే ఎస్‌ఎల్‌ఆర్ అంటారు.

• గుణాత్మక పరపతి నియంత్రణ లేదా ఎంపిక చేసిన పరపతి నియంత్రణ

పరపతిని పూర్తిగా విస్తరించడం లేదా తగ్గించడం కాకుండా దేశ శ్రేయస్సు దృష్ట్యా అవసరమైన రంగాలకు పరపతి సౌకర్యాలను కల్పించడానికి, హానికరమైన రంగాలకు నియంత్రించడానికి ఉపయోగించే సాధనాలే ఎంపిక చేసిన లేదా పరపతి నియంత్రణ. మార్జిన్లు నిర్ణయించడం, పరపతి రేషనింగ్, వినియోగదార్ల పరపతి నియంత్రణ, నైతిక ఉద్బోధ, ప్రత్యక్ష చర్యలు మొదలైనవి ఆర్‌బీఐ పరపతి నియంత్రణ విధానాలు.

ఆర్‌బీఐ పరపతి విధానంలో బ్యాంకుకు చెందిన వివిధ రేట్లు (డిసెంబర్ 8, 2008 నాటికి)

బ్యాంక్‌రేటు	6 శాతం (2003	ఏప్రిల్ 30 నుంచి)
సీఆర్‌ఆర్	5.5 శాతం (నవంబర్ 8, 2008 నుంచి)	
ఎస్‌ఎల్‌ఆర్	24 శాతం (నవంబర్ 3, 2008 నుంచి)	
రెపోరేట్	6.5 శాతం (డిసెంబర్ 8, 2008 నుంచి)	

రివర్స్ రెపో రేట్ 5 శాతం (డిసెంబర్ 8, 2008 నుంచి)

బ్యాంకింగ్ రంగానికి చెందిన మరికొన్ని ముఖ్యాంశాలు

- వాణిజ్య బ్యాంకులు రెండు రకాలు.
  షెడ్యూల్డ్ బ్యాంకులు
  నాన్ షెడ్యూల్డ్ బ్యాంకులు
- **షెడ్యూల్డ్ బ్యాంకులు:** రిజర్వ్‌బ్యాంక్ చట్టం(1934) రెండో షెడ్యూల్డ్‌లో నమోదైన బ్యాంకులు. **ఉదా:** మన దేశంలో జాతీయం చేసిన వాణిజ్య బాంక్యులు, ఎస్‌బీఐ
- **నాన్ షెడ్యూల్డ్ బ్యాంకులు:** రిజర్వ్ బ్యాంక్ చట్టం(1934) రెండో షెడ్యూల్డ్‌లో నమోదు కాని బ్యాంకులు
- **నాబార్డ్:** జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్. దీనిని శివరామన్ కమిటీ సిఫార్సుల మేరకు 1982లో స్థాపించారు. గ్రామీణాభివృద్ధిలో ఇది శిఖరాగ్ర సంస్థ.
- మన దేశంలో 1904 సహకార పరపతి సంఘాల ఆధారంగా సహకార బ్యాంకులను స్థాపించారు. సహకార రంగంలో రాష్ట్ర సహకార బ్యాంక్ శిఖరాగ్ర సంస్థ.
- పరిశ్రమలకు మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేయడానికి పారిశ్రామిక లేదా పెట్టుబడి బ్యాంకులను స్థాపించారు. అవి.. ఐఎఫ్‌సీఐ-1948; ఐసీఐసీఐ-1955; ఐడీబీఐ-1964; సిడ్బీ-1990; ఎస్ఎఫ్‌సీ - 1951
- నర్సింహం కమిటీ సిఫార్సుల మేరకు 1975లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను స్థాపించారు.
- ఎస్‌బీఐ-1806లో కలకత్తాలో, 1840లో బొంబాయిలో, 1843లో మద్రాస్‌లో ప్రెసిడెన్సీ బ్యాంకులు ఏర్పడ్డాయి. ఈ మూడింటినీ విలీనం చేసి 1921లో ఇంపీరియల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. గోర్వాలా కమిటీ సిఫార్సుల మేరకు 1955 జూలైలో ఇంపీరియల్ బ్యాంక్‌ను ఎస్‌బీఐగా మార్చారు.

PRACTICE QUESTIONS

1. బ్యాంక్ రేట్ అంటే?(ఎపీపీఎస్‌సీ 2004)

ఎ) వాణిజ్య బ్యాంకులు అప్పు ఇచ్చే రేటు
బి) వాణిజ్య బ్యాంకులు డిపాజిట్లు స్వీకరించే రేటు
సి) రిజర్వ్ బ్యాంక్ వాణిజ్య బ్యాంక్‌లకు అప్పు ఇచ్చే రేటు
డి) పైవేవీ కావు

2. ఐసీఐసీఐ దేశంలో 1955లో స్థాపించిన రెండో అఖిలభారత ప్రత్యేక పారిశ్రామిక ఆర్థిక సంస్థ. మొదటి సంస్థ ఏది?

(ఏపీపీఎస్‌సీ 2004)

ఎ)ఐడీబీఐ బి) సిడ్బీ
సి) ఐఎఫ్‌సీఐ డి) ఎస్ఎస్ఐసీ

3. లీడ్‌బ్యాంక్ పథకం దేనికి సంబంధించింది?

(ఎపీపీఎస్‌సీ 2008)

ఎ) నారీమన్ కమిటీ బి) నర్సింహం కమిటీ
సి) చక్రవర్తి కమిటీ డి) రంగరాజన్ కమిటీ

4. నేషనల్ హౌసింగ్ బ్యాంక్‌ను దేనికి పూర్తి అనుబంధంగా స్థాపించారు?

(యూపీఎస్‌సీ 2007)

ఎ) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బి) ఆర్‌బీఐ సి) ఐసీఐసీఐ డి) ఎల్ఐసీ

5. ద్రవ్య విధానాన్ని ఎవరు నియంత్రిస్తారు?

ఎ) ప్రభుత్వం బి) రిజర్వ్‌బ్యాంక్
సి) ద్రవ్యం అప్పిచ్చేవారిది
డి) వాణిజ్య బ్యాంకులు

6. కింది వాటిలో ఏది పరిమాణాత్మక పరపతి నియంత్రణ కాదు?

ఎ) బ్యాంక్ రేట్ బి) రిజర్వు నిష్పత్తిలో మార్పు
సి) మార్జిన్ల నిర్ణయం డి) పైవేవీ కావు

7. వాణిజ్య బ్యాంకులు రిజర్వ్‌బ్యాంక్ వద్ద ఉంచాల్సిన కనిష్ట నగదు నిల్వల నిష్పత్తిని ఏమంటారు?

ఎ) ఎస్ఎల్ఆర్ బి) సీఆర్ఆర్
సి) ఎస్ఆర్ఆర్ డి) ఎల్ఆర్ఆర్

8. బహిరంగ మార్కెట్ చర్యలంటే?

ఎ) డిపాజిట్ల సేకరణ
బి) రిజర్వ్ బ్యాంక్ నుంచి రుణాలు తీసుకోవడం
సి) రిజర్వ్ బ్యాంక్ ప్రభుత్వ సెక్యూరిటీలను కొనడం, అమ్మడం
డి) ప్రభుత్వ బ్యాంకులకు రుణాలు ఇవ్వడం

9. బ్యాంకుల నగదు నిష్పత్తి 20 శాతం అయితే డిపాజిట్ గుణం ఎంత?

ఎ) 4 బి) 5 సి) 10 డి) 20

10. 14 వాణిజ్య బ్యాంకులను జాతీయం చేసిన సంవత్సరం?

ఎ) 1980 బి) 1969 సి) 1955 డి) 1982

సమాధానాలు

1 సి	2 సి	3 ఎ	4 బి	5 బి
6 సి	7 బి	8 సి	9 బి	10 బి

నగదు నిల్వల నిష్పత్తి అంటే...

రిజర్వ్ బ్యాంక్ విధులు

''నిప్పు, చక్రం లాంటి నవకల్పనకు దీటుగా, ప్రపంచంలోని మూడో నవకల్పనగా కేంద్ర బ్యాంక్‌ను 'హిల్ రోజర్స్' అభివర్ణించాడు. దాన్ని బట్టి కేంద్రబ్యాంక్ ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. 1656లో స్వీడన్‌లో రిక్స్ బ్యాంక్ పేరుతో మొట్టమొదటి కేంద్ర బ్యాంక్ స్థాపించారు. 1694లో ఇంగ్లండ్‌లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, 1800లో బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్‌ను స్థాపించారు. అమెరికాలో కేంద్ర బ్యాంక్‌ను ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్‌గా పిలుస్తారు. మన దేశంలో కేంద్ర బ్యాంక్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ).

భారతీయ రిజర్వు బ్యాంక్ స్థాపన

1926లో కరెన్సీ, ఫైనాన్స్‌పై నియమించిన రాయల్ కమిషన్ (దీన్నే హిల్టన్ యంగ్ కమిషన్ అంటారు), 1931లో ఏర్పాటు చేసిన సెంట్రల్ బ్యాంకింగ్ ఎంక్వైరీ కమిటీ సూచనల మేరకు 1934లో రిజర్వ్ బ్యాంకు చట్టం చేశారు. 1935 ఏప్రిల్ 1న భారతీయ రిజర్వ్ బ్యాంక్‌ను స్థాపించారు. ఒక్కొక్క వాటా 100 రూపాయల చొప్పున 5 లక్షల వాటాలతో 5 కోట్ల రూపాయలతో ప్రారంభించారు. కొద్దిమంది చేతిలో వాటాలు కేంద్రీకృతం అవడం న్యాయం కాదని భావించి 1949 జనవరి 1న భారతీయ రిజర్వ్ బ్యాంక్‌ను జాతీయం చేశారు.

ఒక గవర్నర్ నలుగురు డిప్యూటీ గవర్నర్లతో కూడిన 20 మంది గల డైరెక్టర్ల బోర్డు ఆర్‌బీఐని నిర్వహిస్తుంది. దీని ప్రధాన కార్యాలయం ముంబయిలో ఉంది. నాలుగు స్థానిక బోర్డులు ముంబయి, చెన్నై, కోల్‌కతా, న్యూఢిల్లీల్లో ఉన్నాయి. ఆర్‌బీఐ మొదటి గవర్నర్ 'స్మిత్'. ఆర్‌బీఐ మొదటి భారతీయ గవర్నర్ సి.డి. దేశ్‌ముఖ్. ప్రస్తుత గవర్నర్ దువ్వూరి సుబ్బారావు. భారతదేశ మొత్తం ద్రవ్య మార్కెట్‌కు ఆర్‌బీఐ శిఖరాగ్ర సంస్థ (Apex).

ఆర్‌బీఐ విధులు

సంప్రదాయ విధులతో పాటు పర్యవేక్షణ, ప్రోత్సాహక విధులను కూడా ఆర్‌బీఐ నిర్వహిస్తుంది.

ఎ. సంప్రదాయక విధులు

i. కరెన్సీ నోట్ల జారీ

కరెన్సీ నోట్ల జారీలో ఆర్‌బీఐకి గుత్తాధిపత్య అధికారముంది. రెండు రూపాయల నుంచి 1000 రూపాయల వరకు ఆర్‌బీఐ ముద్రిస్తుంది. రూపాయి నాణేలను, నోట్లను భారత ఆర్థిక శాఖ ముద్రిస్తుంది. రూపాయి నోట్లపై ఆర్థిక శాఖ కార్యదర్శి సంతకం ఉంటుంది. 1956 వరకు మన దేశంలో నోట్ల జారీకి అనుపాత నిల్వల పద్ధతిని అవలంబించేవారు. 1956లో దీన్ని రద్దు చేసి 'కనిష్ట నిల్వల పద్ధతి'ని ప్రవేశపెట్టారు. ఈ పద్ధతి ప్రకారం రిజర్వ్ బ్యాంకు వద్ద ఉండాల్సిన కనిష్ట నిల్వలు రూ. 200 కోట్లు. అందులో కనీసం రూ. 115 కోట్లు బంగారంలో, మిగతా విదేశీ సెక్యూరిటీల రూపంలో ఉండాలి.

ii. ప్రభుత్వానికే బ్యాంక్

రిజర్వ్ బ్యాంక్ కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు బ్యాంకరుగా, ఏజెంటుగా, ఆర్థిక సలహాదారుగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వ నగదు నిల్వలను డిపాజిట్ రూపంలో పెట్టుకోవడం, ప్రభుత్వం తరపున చెల్లింపులు చేయడం ఆర్‌బీఐ విధి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 90 రోజుల కాల పరిమితితో స్వల్పకాలిక రుణాలను మంజూరు చేస్తుంది. వీటినే వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ (Ways and Means Advances) అంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కరెన్సీ, పరపతి ఆర్థిక సమస్యల విషయంలో సలహాలిస్తుంది.

iii. బ్యాంకులకు బ్యాంక్

రిజర్వ్ బ్యాంక్ భారతదేశంలోని బ్యాంకులకు బ్యాంకుగా వ్యవహరిస్తుంది. ప్రతీ వాణిజ్య బ్యాంకు తమ డిపాజిట్లలో కొంత కరెన్సీని ఆర్‌బీఐ వద్ద ఉంచాలి. దీన్నే నగదు నిల్వల నిష్పత్తి అంటారు. వాణిజ్య బ్యాంకుల అర్హత కలిగిన బిల్లులను ఆర్‌బీఐ రీ డిస్కౌంట్ చేస్తుంది.

iv. అంతిమ రుణదాత

అత్యవసర పరిస్థితుల్లో వాణిజ్య బ్యాంకులను ఆర్‌బీఐ ఆదుకుంటుంది. అందువల్ల ఆర్‌బీఐని అంతిమ రుణదాత అంటారు.

v. క్లియరింగ్ హౌస్‌లు నిర్వహించడం

వాణిజ్య బ్యాంకులు ఇతర బ్యాంకులకు చెల్లించాల్సిన మొత్తాలను, ఇతర బ్యాంకుల నుంచి వసూలు చేసుకోవాల్సిన మొత్తాలను ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన క్లియరింగ్ హౌస్‌ల ద్వారా పరిష్కరించుకోవచ్చు.

vi. పరపతి నియంత్రణ

ఆర్‌బీఐ విధుల్లో అతి ముఖ్యమైంది పరపతి నియంత్రణ. వాణిజ్య బ్యాంకులు సృష్టించే పరపతి వల్ల ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ పరిస్థితులు రాకుండా, స్థిరత్వాన్ని సాధించేందుకు వాణిజ్య బ్యాంకుల పరపతిని ఆర్‌బీఐ నియంత్రిస్తుంది. దానికోసం పరిమాణాత్మక పరపతి నియంత్రణ, గుణాత్మక పరపతి నియంత్రణ అనే రెండు సాధనాలను వినియోగిస్తుంది.

vii. అంతర్జాతీయ ద్రవ్య నిధులను సంరక్షించడం

ఒక దేశ బంగారం నిల్వలు, విదేశీ మారక ద్రవ్య నిల్వలు కేంద్ర బ్యాంకు వద్ద ఉంటాయి. విదేశీ మారక నిల్వల సంరక్షకుడిగా ఆర్‌బీఐ వ్యవహరిస్తుంది. విదేశీ మారక నిర్వహణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తరపున అమలు చేస్తుంది.

బి. పర్యవేక్షణ విధులు:

ఆర్‌బీఐ కొన్ని ద్రవ్యేతర విధులను కూడా నిర్వహిస్తుంది. వీటిని పర్యవేక్షణ విధులంటారు. వాణిజ్య బ్యాంకులను, సహకార బ్యాంకులను తనిఖీ చేసి వాటికి లైసెన్స్‌లు ఇవ్వవచ్చు లేదా రద్దు చేయవచ్చు.

అంటే సామాజిక లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకింగ్ వ్యవస్థను నిర్దేశించే బాధ్యత రిజర్వ్ బ్యాంకుదే.

సి. అభివృద్ధి విధులు

ఆర్‌బీఐ అభివృద్ధికి ప్రోత్సాహమిచ్చే విధులను కూడా నిర్వహిస్తుంది. వ్యవసాయ అభివృద్ధి కోసం వ్యవసాయ పునఃవిత్త అభివృద్ధి కార్పొరేషన్ (ARDC)ను స్థాపించింది. 1982లో 'నాబార్డ్' (NABARD)ను స్థాపించేందుకు కృషి చేసింది.

- పారిశ్రామిక రుణాల కోసం వివిధ పారిశ్రామిక ద్రవ్య సంస్థలైన IDBI, IFCI, SFC స్థాపనకు కృషి చేసింది.
- చిన్న మొత్తాల్లో పొదుపులను సేకరించి, పెట్టుబడిగా మార్చడానికి ''యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (UTI) వంటి సంస్థ స్థాపనకు దోహదపడింది.
- సహకార సంస్థల స్థాపన ద్వారా వ్యవసాయ పరపతి సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు కృషి చేసింది.
- ద్రవ్య మార్కెట్‌ను అభివృద్ధిచేసి పరపతిని పెంపొందించడానికి మొదటిసారిగా 1952లో బిల్లు మార్కెట్ పథకాన్ని ప్రారంభించింది.

డి. అనుషంగిక విధులు

వివిధ సహకార బ్యాంకుల, వాణిజ్య బ్యాంకుల పర్యవేక్షక సిబ్బందికి శిక్షణనివ్వడానికి కళాశాలలను రిజర్వ్ బ్యాంక్ ఏర్పాటు చేసింది. బ్యాంకర్ల శిక్షణ కళాశాల ముంబయిలో, వ్యవసాయ బ్యాంకింగ్ కళాశాల పుణెలో, రిజర్వు బ్యాంకు సిబ్బంది కళాశాల చెన్నైలో ఉన్నాయి.

- బ్యాంకింగ్, ఫైనాన్స్, పరపతి, కరెన్సీ, వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులకు సంబంధించిన గణాంకాలను సేకరించి ముద్రిస్తోంది.
- వివిధ ఆర్థిక, ద్రవ్య కమిటీల నివేదికలను నెలసరి బులెటిన్ల రూపంలో కూడా ప్రచురిస్తోంది.

రిజర్వ్ బ్యాంక్ సంప్రదాయ సిద్ధమైన కేంద్ర బ్యాంకు విధులనే కాకుండా, ఆర్థికాభివృద్ధికి దోహదపడే నూతన విధులను కూడా నిర్వహిస్తోంది. వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధికి, ద్రవ్య మార్కెట్ విస్తృతికి, సహకార రంగ అభివృద్ధికి ఆర్‌బీఐ అనేక విధాలుగా కృషి చేస్తోంది.

PREVIOUS QUESTIONS

1. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు మొదటి భారతీయ గవర్నర్? (జె.ఎల్. 2007)

ఎ) సి. రంగరాజన్ బి) కె.సి. నియోగి
సి) వై.వి. రెడ్డి డి) సి.డి. దేశ్‌ముఖ్

2. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను స్థాపించిన సంవత్సరం? (జె.ఎల్. 2007)

ఎ) 1937 బి) 1936 సి) 1935 డి) 1947

3. ప్రస్తుతం ఆర్‌బీఐ అవలంబించే కనీస నిల్వల విధానం ప్రకారం ఎంత కనీస బంగారం నిల్వ ఉన్నట్లయితే, నోట్లను జారీ చేయవచ్చు? (జె.ఎల్. 2007)

ఎ) రూ. 85 కోట్లు బి) రూ. 115 కోట్లు
సి) రూ. 200 కోట్లు డి) రూ. 250 కోట్లు

4. భారత దేశంలో నోట్ల జారీలో అవలంబించే పద్ధతి? (జె.ఎల్ 2001)

ఎ) అనుపాత నిల్వల పద్ధతి బి) పాక్షిక విశ్వాసాశ్రిత పద్ధతి
సి) కనిష్ట నిల్వల పద్ధతి డి) ఏదీ కాదు

5. కింది వాటిలో ఏది తప్పు? (నాన్‌గెజిటెడ్ 2005)

ఎ) కేంద్ర బ్యాంక్ దేశంలో పరపతి నియంత్రణ బాధ్యత చేపడుతుంది
బి) కేంద్ర బ్యాంక్ బ్యాంకులకు బ్యాంకు వంటిది
సి) కేంద్ర బ్యాంక్ ఆర్థిక ప్రణాళికలను చేపడుతుంది
డి) కేంద్ర బ్యాంక్, వాణిజ్య బ్యాంకులను కష్టకాలంలో ఆదుకుంటుంది

6. భారతీయ రిజర్వ్ బ్యాంకును ఏ సంవత్సరంలో జాతీయం చేశారు? (డీఈఓ 2008)

ఎ) 1935 బి) 1947 సి) 1949 డి) 1951

7. ఆర్‌బీఐ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది? (ఏపీపీఎస్సీ)

ఎ) ఢిల్లీ బి) ముంబయి
సి) కాన్పూర్ డి) నాసిక్

8. ఆర్‌బీఐ కృషితో NABARDను ఎప్పుడు స్థాపించారు? (ఏపీపీఎస్సీ)

ఎ) 1968 బి) 1964 సి) 1980 డి) 1982

9. ఒక రూపాయి నోటుపై ఎవరి సంతకం ఉంటుంది? (ఏపీపీఎస్సీ)

ఎ) ఆర్‌బీఐ గవర్నర్ బి) ఆర్థిక మంత్రి
సి) ప్రధాన మంత్రి డి) ఆర్థికశాఖ కార్యదర్శి

సమాధానాలు

1	డి	2	సి	3	బి	4	సి	5	సి
6	సి	7	బి	8	డి	9	డి		